క్లుప్తంగా

వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ జిల్లా చార్టర్ గవర్నర్‌గా కాళీకృష్ణ



దేవరపల్లి: వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చార్టర్ గవర్నర్‌గా దేవరపల్లికి చెందిన యువ పారిశ్రామిక శ్రీకాకొళపు కాళీకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తిరివీధి వేణుగోపాల్ చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రం అందుకున్నారు. పలువురు ఆర్యవైశ్యులు కాళీకృష్ణను అభినందించారు.

సువర్ణరాజు వితరణ

గోపాలపురం: దొండపూడి పంచాయతీ పరిధిలోని సాగిపాడుకు చెందిన దివ్యాంగుడు కె పవన్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు శుక్రవారం రూ.10 వేల నగదు, 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, మద్దాల కాశీవిశ్వనాథ సనారీ, కడియం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో ఆక్రమణల తొలగింపు



ఐదో వార్డులో ఆక్రమణల తొలగింపు పనుల వద్ద సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి

తాళ్లపూడి: పెద్దేవం పంచాయతీ పరిధిలో ఆక్రమణలు తొలగించి ప్రజల ఇబ్బందులు తొలగించే చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ పేర్కొన్నారు. గ్రామంలోని ఐదో వార్డు వాసుల విజ్ఞప్తి మేరకు ఆ వార్డులోని ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ప్రజల రాకపోకలకు వీలుగా మూడడుగుల రోడ్డును నాలుగడుగులకు వెడల్పు చేసేందుకు ఆక్రమణలో ఉన్న గోడలను కొట్టివేసినట్టు వారు వివరించారు. రోడ్డు కూడా పల్లంగా ఉన్నందున దానిపై కొత్త రోడ్డు వేస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని అన్ని వార్డుల్లోనూ సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామని ఉప సర్పంచ్ తోట రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాంబమూర్తి కూడా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్ పరిశీలన

నల్లజర్ల: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని కిచెన్ గార్డెన్‌లలో సాగవుతున్న వివిధరకాల ఆకుకూరలు, కాయగూరలను ఐసీడీఎస్ ఏ సీడీపీఓ పద్మావతి శుక్రవారం పరిశీలించారు. నల్లజర్ల సర్పంచ్ సర్పంచ్ పల్లి జ్యోతి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు రసాయనాలు, పురుగు మందుల రహిత ఆహారాన్ని అందించే లక్ష్యంతో సేంద్రియ ఎరువులతో వాటిని పండిస్తున్నామన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు ఆకుకూరలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పంచాయతీ పెద్దలు ఆనంద్, చైతన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు శివకుమారి, శాంతవల్లి, దేవి,నాగలక్ష్మి పాల్గొన్నారు.

వేలివెన్నులో నేటి నుంచి సప్తాహం

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలోని సీతారామచంద్రస్వామి, వేణుగోపాలస్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 4 నుంచి 11 వరకూ అఖండ నామ సంకీర్తన సప్తాహ మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. 4న స్వామివార్ల మూల విరాట్‌లకు వేద పండితులు ధూళిపాక పట్టాభిరామశర్మచే విఘ్నేశ్వర పూజ, పంచామృతాలతో అభిషేకం, అఖండ దీపారాధన, కుంకుమార్చనలతో సప్తాహాలు ప్రారంభం అవుతాయన్నారు. 10వ తేదీ ముక్కోటి ఏకాదశి నాడు స్వామి వార్ల కల్యాణం, పవళింపు సేవ, ప్రభాతసేవ నిర్వహిస్తామన్నారు. 11న అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఏడు రోజులు 30 భజన మండలి సమాజాలు భజనలో పాల్గొంటాయన్నారు.

కారు ధ్వంసం చేసిన 8 మందిపై కేసు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామానికి చెందిన కావేటి రవిశేఖర్ అనే వ్యక్తికి చెందిన కారును డిసెంబర్ 31వ తేదీ రాత్రి దుండగుల ధ్వంసం చేశారు. గ్రామానికే చెందిన పిల్లి గణేష్‌తో పాటు మరో ఏడుగురు వ్యక్తులు తన కారును ధ్వంసం చేసినట్టు రవిశేఖర్ కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో తాను గణేష్‌ను మందలించానని, ఆ కోపంతో ఈ వారంతా చర్యకు పాల్పడ్డాడని ఆయనా ఫిర్యాదులో పేర్కొన్నట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వారు ఎనిమిది మందిపైనా శుక్రవారం కేసు నమోదు చేశామన్నారు.

శీతలం.. వ్యాధులకు మూలం

- పడిపోయిన పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు
- వ్యాధుల బారిన పిల్లలు, వృద్ధులు
- పంటల పైనా తీవ్ర ప్రభావం

తాళ్లపూడి: చలి చంపేస్తోంది. ఉదయం 9 గంటల వరకూ పొగమంచు భయపెడుతోంది. కొద్ది రోజులుగా రాత్రి, పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రాత్రివేళ మంచు కూడా కురుస్తుండడంతో జనం వ్యాధుల బారిన పడుతున్నారు. రోగనిరోధక శక్తి తగ్గి పిల్లలకు కూడా మంచం పడుతున్నారు. ఎక్కువ శాతం మంది జ్వరం, జలుబుతో బాధపడుతున్నారు. ప్రస్తుత వాతావరణం కొన్నిరకాల పంటలకు మేలు చేస్తుండగా, మరికొన్ని రకాల పంటలకు నష్టం కలిగిస్తోంది. ముఖ్యంగా రబీ వరి నారుమళ్లు, మొక్కజొన్న పంటలను ఎదుగుదల లేకుండా చేస్తోంది. వేకువజామునే వివిధ రకాల పనులకు వెళ్లే వారు చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో ప్రస్తుతం రబీ వ్యవసాయ పనులు జోరుగా జరుగుతున్నాయి. కొద్ది రోజులుగా వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. చలి అధికంగా ఉన్నప్పటికీ కూలి పనులు చేసుకునే వారు పొలం పనులకు వెళ్లక తప్పడం లేదు. రబీ పనులకు వెళ్లే కూలీలు , పాఠశాల విద్యార్థులు, పాల వ్యాపారులు, ఆకుకూరలు, కూరగాయలు విక్రయించేవారు, హోటళ్ల నిర్వాహకులు, మార్నింగ్ వాకింగ్ చేసే వారు చలికి గజగజ వణుకుతూ తమతమ పనులు చేసుకుంటున్నారు.



తాళ్లపూడి మండలంలో కురుస్తున్న మంచు

ఆరోగ్య సమస్యలు..

ఉదయాన్నే మంచులో తిరిగేవారు శ్వాస సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరిగే కొద్దీ రక్త నాళాలు సంకోచిస్తాయి. దీంతో అవయవాలకు రక్త ప్రసరణ తగ్గి గుండె మరింత వేగంగా పని చేయాల్సి ఉంటుంది. గుండె జబ్బులు, మధుమేహం, ఆస్తమా, వ్యాధిగ్రస్తులకు వింటర్ శత్రువనే చెప్పాలి. ఈ క్రమంలో జలుబు, జ్వరాలతో పలువురు ఆసుపత్రుల బాట పడుతున్నారు. మంచు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లలు, వృద్ధుల చలిలో తిరగవద్దని సలహా ఇస్తున్నారు.

స్వెట్టర్లకు పెరిగిన డిమాండ్

చలి తీవ్రత ఎక్కువ కావడంతో స్వెట్టర్లు, ఉన్ని వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కనే స్టాల్‌లు పెట్టి స్వెట్టర్లు, చలికోట్‌లు, జర్కిన్‌లు, మంకీ క్యాప్‌లు, మాస్కులు విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో రాజస్థాన్ నుంచి వచ్చే వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు అమ్ముతున్నారు. ఒక్కొక్కటి రూ.350, రూ.400, రూ.600, రూ.800 వరకు చలి దుస్తుల నాణ్యతను బట్టి విక్రయిస్తున్నారు. జనం కూడా వీటిని కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



చలి కాలంలో ఆరోగ్యవంతులు సైతం వ్యాధులబారిన పడే ముప్పు ఉంది. గోరు వెచ్చని నీటిని తాగాలి. వ్యాధినిరోధక శక్తిని పెంచే ఆహారం తీసుకోవాలి. ఉదయం, రాత్రి సమయాల్లో ఆరుబయట తిరగడం మానుకోవాలి. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే రక్షణ దుస్తులు ధరించాలి. మంచులో ప్రయాణం మంచిది కాదు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలి.అలర్జీ, జలుబు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈ కాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై నిర్లక్ష్యం చేయకూడదు.

– డా. అన్నపూర్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి, మలకపల్లి

పంటలపై ప్రభావం



ఆకుకూరలు, కాలీఫ్లవర్, ఇతర ఉద్యానవన పంటలకు మాత్రం ఈ చల్లని వాతావరణం మేలు చేస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న మంచు, తగ్గిన ఉష్ణోగ్రతల వల్ల కొన్నిరకాల పంటలకు నష్టం తప్పదు. రబీ వరి నారుమడులపై మంచు ప్రతికూల ప్రభావం చూపుతోంది. నారుమడి మొలక శాతం తగ్గుతుంది. వరి పైరుకు అగ్గి తెగులు ఆశిస్తుంది. మొక్కజొన్న పంట కూడా ఎదుగుదల లోపిస్తుంది.రాత్రి, పగటి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం వల్ల ఇలా జరుగుతుంది.

– జి రుచిత , మండల వ్యవసాయాధికారి, తాళ్లపూడి

పొగాకు రైతులకు 50 ఏళ్లుగా బోర్డు సేవలు



గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న దామోదర్

గోపాలపురం: పొగాకు బోర్డు ద్వారా రైతులకు 50 ఏళ్లుగా అనేక సేవలు అందిస్తున్నామని గుంటూరు పొగాకు బోర్డు వేలం విభాగం అధికారి డి. దామోదర్ అన్నారు. బోర్డు స్థాపించి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులకు బోర్డు అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ బోర్డు ఏర్పడకముందు రైతుల వద్ద నుంచి దళారులు పొగాకు కొనుగోలు చేసి, డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టేవారన్నారు. ఈ విధంగా ఎక్కువ మంది రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గత 50 సంవత్సరాలుగా గుంటూరు పొగాకు బోర్డు ద్వారా రైతులకు ఎనలేని సేవలు అందించినట్టు గుర్తు చేశారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త కె.సుబ్బయ్య మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు మేలైన యాజమాన్య పద్ధతులు వివరిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుంటూరు వేలం అధికారి కేవీ రామాంజనేయులు, ఆర్ఎం జీఎల్ కే ప్రసాద్, పొగాకు వేలం నిర్వహణాధికారి అమూల్ డీ శ్యామ్, రైతు సంఘం నాయకులు గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రాంబాబు, మధుమోహన్, ఐపీ రాజు రైతులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పాలన అధ్వానం

- గ్రామాల్లో పారిశుధ్యం కూడా మెరుగు పడలేదు
- అధికారులు పనితీరు మార్చుకోవాలి
- ఆరు నెలల నియోజకవర్గ ప్రోగ్రెస్‌పై ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సమీక్ష

నల్లజర్ల: క్షేత్రస్థాయిలో పాలన అధ్వానంగా ఉందని, అధికారులు తమ పనితీరు మార్చుకోవాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలైంది. ఈ క్రమంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఎమ్మెల్యే శుక్రవారం నల్లజర్ల స్టార్ గ్రాండ్‌లో అధికారులతో సమీక్ష జరిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబం అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకు అధికారులు తమ వంతు కృషి చేయాలన్నారు. వచ్చిన నిధులను ప్రజలకు మౌలిక సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఏవిధంగా ఖర్చు చేయాలి? అదనపు నిధులు ఏవిధంగా సమీకరించుకోవాలనే విషయాలపై ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయి పాలనలో ఏవిధమైన మార్పూ కనబడడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో సక్రమంగా పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేయకపోవడం విచారకరమన్నారు. చదువుకున్న తన లాంటి యువకుడు ఎమ్మెల్యే అయితే ఎంతో మార్పు సాధించవచ్చని ఆశించానని, ఇప్పుడు అలాంటిదేమీ కనబడడం లేదన్నారు. ఏడాది కాలంలో అధికారులు ఏం మార్పు తీసుకువస్తారో చూస్తానని, మళ్లీ 2026 జనవరి 3న ఇదే ప్రదేశంలో సమీక్ష జరుగుతుందన్నారు. చాలా గ్రామాల్లో యువత ఉపాధి లేక వేరే ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమలు తీసుకు వచ్చియవతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీ మూర్తి , డ్వామా ఏపీడీ కె.కిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.అప్పారావు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- ఇప్పటికే 50 ఫిర్యాదుల పరిష్కారం
- పరిష్కరించాల్సినవి మరో 113
- పెరవలి తహసీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాలవారీగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులు పెరవలి మండలంలో శుక్రవారంతో ముగిశాయి. సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన వాటిలో 50 ఫిర్యాదులను ఇప్పటికే పరిష్కరించామని, మరో 113 పరిష్కరించవలసి ఉందని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి వివరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె రెవెన్యూ అధికారులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. కానూరు అగ్రహారం, కానూరు గ్రామాల ప్రజలు, రైతుల నుంచి ఇబ్బందికరమైన ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. గ్రామ కంఠం భూములు, దేవాలయాల భూములు కలసి పోయాయని, వాటిని పరిష్కరించవలసి ఉందన్నారు. మండలంలోని మొత్తం 14 రెవెన్యూ గ్రామాలకుగాను, ఇప్పటికే 8 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయ్యిందన్నారు. ప్రస్తుతం ఖండవల్లిలో రీ సర్వే చేపట్టామన్నారు. ఈ రీ సర్వేలో 11 టీమ్‌లు పాల్గొంటాయని చెప్పారు. ఒక్కో టీమ్‌లో ముగ్గురు అధికారులు, 250 ఎకరాల పంట భూములను సర్వే చేయవలసి ఉంటుందన్నారు. కొత్తపల్లి అగ్రహారం, పెరవలి, తీపర్రు, కాకరపర్రు, కానూరు అగ్రహారం గ్రామాల్లో రీ సర్వే చేయవలసి ఉందన్నారు. సమత్వ సర్వేకు ప్రస్తుతం మండలం నుంచి కాపవరం, కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, ముక్కామల గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. కాగా మండలంలోని ముక్కామల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల నుంచి 8 ఫిర్యాదులు భూసర్వేల కోసం వచ్చాయని తహసీల్దార్ అచ్యుతకుమారి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, గండేపల్లి రామకృష్ణ, ఆర్ఐ పావని రైతులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

నిడదవోలు రూరల్: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ సూచించారు. మండలంలోని పందలపర్రులో గ్రామ రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో వివిధ రెవెన్యూ సమస్యలపై 11 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పులుమంతుల నాగదుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు ఆకుల దేవి, డిప్యూటీ తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోడి పందేల కట్టడికి కమిటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణిసుస్మిత

కొవ్వూరు: కోడి పందేల నియంత్రణకు గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆర్డీవో రాణి సుస్మిత ఆదేశించారు. పందేల కట్టడిపై శుక్రవారం రాత్రి ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గతంలో కోడిపందేల నిర్వాహకులు, జూదరులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్, పోలీసు, పశుసంవర్ధక, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో పందేలు నిర్వహించిన ప్రదేశాలను గుర్తించి ఆయా పొలం యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. పందేలకు వ్యతిరేకంగా గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

మాకు కులాన్ని ప్రసాదించండి సారూ..!

పెరవలి: ఏళ్లతరబడి పోరాడుతున్న తమకు కులాన్ని కేటాయించాలని బేడ బుడగ జంగాల వారు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ సందర్భంగా అయినా తమ కులాన్ని రాజ్యాంగంలో చేర్చాలని కోరారు. ఈ మేరకు బేడబుడగ జంగాల ప్రతినిధులు శుక్రవారం పెరవలిలో తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ జి. శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ జరుగుతున్నా తమను ఎవరూ సంప్రతించడం లేదన్నారు. ఇదేమిటని సర్వే అధికారులను ప్రశ్నిస్తే, బేడ బుడగజంగాలను ఏ కులంలో చేర్చాలో తమకు ఇచ్చిన కులాల జాబితాలో పేర్కొనలేదని బదులిస్తున్నారన్నారు. కులం లేక, 60 ఏళ్లుగా ప్రభుత్వ పథకాలు అందక అవస్థలు పడుతున్నామని, పిల్లలను స్కూల్లో చేర్పించేటపుడు ఏ కులం అని చెప్పి రాయించాలో తెలియడం లేదని వాపోయారు. బేడ బుడగజంగాలను ఎస్సీ బిలోని 18 కులాల్లో చేర్చినప్పటికీ రాష్ట్రాల్లో న్యాయం మాత్రం జరగడం లేదన్నారు. వారి సమస్యను తప్పకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ అచ్యుతకుమారి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 100 మంది బేడ బుడగ జంగాలు ప్రతినిధులు పాల్గొన్నారు.



మండల కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న బేడ బుడగ జంగాలు

సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోండి

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

తాళ్లపూడి: రానున్న సంక్రాంతి పండగను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత సూచించారు. కోడి పందేలు, జూదాల వంటి వాటి జోలికి వెళ్లకుండా పేద,మధ్య తరగతి వర్గాల వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆమె తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కోడి పందేల బరులు ఏర్పాటు చేసే భూముల యజమానులకు నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. బోట్స్‌మన్ సొసైటీల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపులు అందుబాటులోకి తేవాలని పలువురు ఆమెను కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి తదితరులు ఉన్నారు.



తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

సెపక్‌తక్రా జూనియర్ జిల్లా జట్ల ఎంపిక



దొమ్మేరులో రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా జూనియర్స్ జట్లు

కొవ్వూరు: సెపక్ తక్రా జిల్లాస్థాయి జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపికలను శుక్రవారం దొమ్మేరు హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 46 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారు. బాలుర జట్టుకు వై.విశ్వాస్ పాల్ (రాజమహేంద్రవరం), రాజానగరం గైట్‌కు చెందిన బి.చరణ్, బి.రవితేజ, రామన్నపాలేనికి చెందిన బి.రాధాకృష్ణ, వై.ఆంటోనీ, దేవరపల్లికి చెందిన పి.సారథి, దొమ్మేరుకు చెందిన జి.సతీష్ ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టుకు దొమ్మేరుకు చెందిన జి.రోహిత, చిన్నాయిగూడేనికి చెందిన టి.అఖిల, బి.నీరజ, పి.దుర్గా మాధురశ్రీలు, రామన్నపాలేనికి చెందిన ఎం.మహాలక్ష్మి, ఎస్‌కే మహేష్ బేగం, ఎం .లాస్య ఎంపికయ్యారని దొమ్మేరు హైస్కూల్ పీడీ డి.రాజేంద్రకుమార్ తెలిపారు. పీడీలు టి.సరస్వతి, కె.కెనడీ, ఈ.శ్రీనివాసరావు, ఎం.లక్ష్మణరావు క్రీడాకారులను ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ.సూర్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

దార్శనికురాలు సావిత్రీబాయి పూలే

జయంతి సందర్భంగా పలుచోట్ల నివాళి

నిడదవోలు: బాలికా విద్యకు పునాదులు వేసిన గొప్ప దార్శనికురాలు సావిత్రీబాయి పూలే అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, డీఎస్ఓ మున్సిపల్ హైస్కూల్లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. సావిత్రీబాయి పూలే విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్ఎల్ఆర్ హైస్కూల్ టీచర్ కె.కృష్ణకుమారి, బాలికోన్నత పాఠశాల టీచర్ ఉసురుమర్తి హేమలత, ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కళాశాల లెక్చరర్ చీలి మేఘనలకు సావిత్రీ బాయి సేవా పురస్కారాలు అందజేసి సన్మానించారు. వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కమ్యూనిటీ హాలు కమిటీ అధ్యక్షుడు బయ్యే వెంకట్రావు, ఉపాధ్యక్షుడు నూతులపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటేశ్వర్లు, యోగా గురువు సానెపు వెంకట సుబ్బారావు, వారియర్స్ జిమ్ అధినేత బొచ్చా కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరవలి: దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి కెక్కిన సావిత్రీబాయి పూలే జయంతిని శుక్రవారం కానూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణచందు, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రామాంజనేయులు మాట్లాడుతూ అంటరాని కులాల వారి కోసం 1848లో తొలిసారిగా పాఠశాల ఏర్పాటు చేసిన మహాత్ముడు జ్యోతిరావ్ పూలే తన భార్య సావిత్రీబాయిని మొదటి మహిళా ఉపాధ్యాయినిగా నియమించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిడదవోలు అంబేడ్కర్ మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులకు సన్మానం



భీమోలు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం తేజస్వినిని సత్కరిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



విజయవాడలో రేణుదేశాయ్ చేతుల మీదుగా అవార్డ్ అందుకుంటున్న కుసుమ

కుసుమకు సావిత్రీబాయి పూలే స్మారక అవార్డ్

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దారి నంబర్–3 పాఠశాల ఉపాధ్యాయురాలు పి.కుసుమకు సావిత్రీబాయి పూలే స్మారక అవార్డ్ లభించింది. భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయినిగా కుసుమ అవార్డ్ అందుకున్నారు. ప్రముఖ సినీ నటి రేణుదేశాయ్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డ్‌ను స్వీకరించారు.

భీమోలు యూపీ పాఠశాలలో..

గోపాలపురం: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం వివిధ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని భీమోలు ఎంపీ యూపీ పాఠశాల హెచ్ఎం బి.తేజస్విని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఇంగ్లిషు మీడియం రద్దు చేస్తే పోరాటం చేస్తాం

కొవ్వూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని రద్దు చేయాలని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ పేర్కొనడం కుల దురహంకారానికి నిదర్శనమని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాశ్ విమర్శించారు. తెలుగుభాష వికాసం ముసుగులో బడుగుల విద్యా భవిష్యత్‌ను నాశనం చేయవద్దని సూచించారు. ఎన్‌వీ రమణ వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని క్రిస్టియన్‌పేట అంబేడ్కర్ విగ్రహం జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మీ పిల్లలు, మనవళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో చదివిస్తున్నారా? అని శ్యాం రవి ప్రకాశ్ ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మాధ్యమం అమలు కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన జీవో నంబర్ 85 సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా మాజీ న్యాయమూర్తి ఇలా వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. పోలుమాటి అఖిల్, బొంతా లక్ష్మణ్, పురుషోత్తం చిన్నా, చెట్టేబత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.